

48వ వసంతంలోకి..
కాకతీయ యూనివర్సిటీ ఆవిర్భవించి 48 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా శనివారం కేయూ సెనెట్‌హాల్‌లో వేడుకలను నిర్వహించనున్నారు. - 8లో▸



మహాలక్ష్మి ఎక్కడ? - 8లో▸
గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదలో కొట్టుకుపోయిన భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామానికి చెందిన మహాలక్ష్మి అనే మహిళ ఆచూకీ నేటికీ లభ్యం కాలేదు.

గరిష్టం/కనిష్టం
$28^0/23^0$

వాతావరణం
జిల్లాలో ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

కుష్టుపై సమరం

- 31 వరకు ఇంటింటి సర్వే
- జిల్లాలో 665 బృందాలు ఏర్పాటు
- ప్రారంభ దశలో వ్యాధిని గుర్తిస్తే మేలు
- ఇప్పటికే పీహెచ్‌సీల నోడల్ అధికారులకు శిక్షణ



కుష్టు నిర్మూలన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ (ఫైల్)

గీసుకొండ : జిల్లాలో ఈనెల 16 నుంచి కుష్టు నిర్ధారణ కోసం వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేస్తున్నారు. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దాన్ క్యూర్' అనే పద్ధతిలో ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించి తగిన చికిత్స అందించడానికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పీహెచ్‌సీల నోడల్ అధికారులకు ఇటీవల శిక్షణ ఇచ్చారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో కుష్టు నిర్మూలనపై జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 31 వరకు సర్వే చేయడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వ్యాధికి సంబంధించిన ప్రచార కరపత్రాలు, బ్యానర్లను గ్రామాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తున్నారు.

వ్యాధి లక్షణాలు..
శరీరంలో తెల్లని, ఎర్రని రాగి రంగు మచ్చలు ఉండి స్పర్శ లేకుండా మొద్దుబారి ఉండటం, ముఖంపై నూనె పోసినట్లు మెరుస్తూ ఉండటం, దద్దుర్లు రావడం, అరికాళ్లు, అరచేతుల్లో తిమ్మిర్లు రావడం, కనురెప్పలు సరిగా మూసుకోకపోవడం లాంటివి కుష్టు లక్షణాలు. ఇంటింటి సర్వేలో ఇలాంటి లక్షణాలు ఉన్నవారిని సమీపంలోని పీహెచ్‌సీలకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. కుష్టు వ్యాధితో చేతివేళ్లు వంకర పోవడం, ఫుట్ డ్రాప్ సమస్య ఉన్నవారికి ఉచితంగా శస్త్రచికిత్సతో సరిచేస్తారు. అలాంటి రోగులకు ప్రభుత్వం రూ.12 వేలను సాయంగా అందిస్తుంది. వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే ఎండీటీ చికిత్స అందిస్తారు. ఏ దశలో ఉన్నా సాధారణ వ్యాధి లాంటిదే అని ప్రజలు గమనించాలని, ఆందోళన చెందకుండా పీహెచ్‌సీల్లో వైద్యులను సంప్రదించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

వ్యాధి సోకేదిలా..
లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల కుష్టు సోకుతుంది. వ్యాధిగ్రస్తులు తుమ్మినా, దగ్గినా తుంపర్ల ద్వారా దగ్గరలో ఉన్న వారికి వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి ముఖ్యంగా చర్మం, నరాలకు సోకుతుంది. ఇది ఒక రకమైన అంటువ్యాధి కారకం.

రెండు రకాల చికిత్స..
కుష్టు వ్యాధి సోకిన వ్యక్తికి ఒకటి నుంచి ఐదు మచ్చలు ఉంటే వారిని పాసీ బ్యాసిల్లరీ (పీబీ)గా గుర్తిస్తారు. ఇలాంటి వారికి 6 నెలల వరకు చికిత్స ఉంటుంది. కనీసం 9 నెలల్లో కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఐదు కంటే ఎక్కువ మచ్చలు ఉంటే వారిని మల్టీ బ్యాసిల్లరీ (ఎంబీ)గా గుర్తిస్తారు. అలాంటి వారికి 12 నెలలపాటు చికిత్స అందిస్తారు. కనీసం 15 నెలల్లో కోర్సు పూర్తి చేయాలి. బహుళ ఔషధ చికిత్సతో కుష్టును పూర్తిగా నయం చేయవచ్చని వైద్యులు అంటున్నారు. రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖరీదు చేసే మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. 6–12 నెలల వరకు చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని వైద్యులు చెబుతున్నారు. సకాలంలో వ్యాధి లక్షణాలను గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా చూడవచ్చని వారు సూచిస్తున్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి..
జిల్లాలో ప్రస్తుతం 42 మంది కుష్టు రోగులు ఉన్నారు. సర్వే కోసం 665 బృందాలను ఏర్పాటు చేశాం. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు వైద్య బృందాలు ఇంటింటికి తిరుగుతూ సర్వే చేస్తాయి. సర్వేకు ప్రజలు సహకరించాలి.
– డాక్టర్ కె.వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ

అంచనాకు మించి..!

- వరంగల్ రూరల్ జిల్లా ఎక్సైజ్ పరిధిలో 63 వైన్స్‌లకు 2,937 దరఖాస్తులు
- చివరి రోజు భారీగా వచ్చిన అర్జీలు
- ప్రభుత్వానికి రూ.58.74 కోట్ల ఆదాయం
- గతంతో పోలిస్తే 40 శాతం ఎక్కువ



వరంగల్ రూరల్ జిల్లా ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుదారులు

కరీమాబాద్ : వరంగల్ రూరల్ జిల్లా ఎక్సైజ్ పరిధిలోని మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 4న ప్రారంభించగా.. బుధవారం వరకు పదుల సంఖ్యలో వచ్చాయి. వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని 63 దుకాణాలకు గురువారం వరకు 1,443 దరఖాస్తులు రాగా.. చివరి రోజు శుక్రవారం రాత్రి 12 గంటల వరకు 1,494 దరఖాస్తులు వచ్చాయి. వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

గతంతో పోలిస్తే రెట్టింపు..
జిల్లా పరిధిలోని 63 మద్యం దుకాణాలకు గతంతో పోలిస్తే ఈ ఏడాది రెట్టింపు దరఖాస్తులు రావడం విశేషం. అప్పుడు 1,793 దరఖాస్తులు రాగా.. శుక్రవారం వరకు 2,937 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈసారి దరఖాస్తుదారులు జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఏ ప్రాంతంలో వ్యాపారం ఎంత జరుగుతుంది, ఏ దుకాణానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎక్కడ దరఖాస్తు చేసుకుంటే ఫలితం ఉంటుంది అనే విషయాలను గమనిస్తూ డీడీలు చేతపట్టుకుని దరఖాస్తు చేయడం గమనార్హం. పలువురు మద్యం వ్యాపారులు రిజర్వేషన్లకు అనుగుణంగా వారితో పాటు తమ దగ్గరివారితో కూడా దరఖాస్తు చేయించినట్లు తెలుస్తోంది.

సర్కారుకు రూ.కోట్లలో ఆదాయం..
మద్యం దరఖాస్తుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.58.74 కోట్ల ఆదాయం సమకూరింది. గతంలో 1,793 దుకాణాలకు రూ.35.86 కోట్ల ఆదాయం రాగా.. ఇప్పుడు దాదాపు 40 శాతానికిపైగా పెరగడం గమనార్హం. చివరి రోజు అనూహ్యంగా దరఖాస్తులు రావడం విశేషంగా చెబుతున్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట : ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నెక్కొండ మండలం సూరిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ గ్రామ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, యూత్ సభ్యులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్డు సభ్యులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్, గ్రామ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



చెన్నారావుపేట : పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్‌లో భాగంగా మండలంలోని కోనాపురం, కాల్‌నాయక్‌తండా, జల్లీ గ్రామ పంచాయతీలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటికలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీధర్‌రాజు, ఎస్సై తోట మహేందర్, కార్యదర్శులు రాజు, వికాస్, మహేష్, సర్పంచ్‌లు సుజాత, సతీష్ ఉన్నారు.

వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్‌గా జోనా



వర్ధన్నపేట : వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్‌గా జోనా శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన వర్ధన్నపేటకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

నర్సంపేట : నర్సంపేటలోని తెలంగాణ గిరిజన బాలుర గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీలో ఖాళీగా ఉన్న 20 సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ రీజినల్ కోఆర్డినేటింగ్ అధికారి డీఎస్.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్‌ను ఈనెల 27 వరకు సంప్రదించాలని ఆయన సూచించారు.

భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ రెడ్డిపాలెం (మొగిలిచర్ల) రైతు వేదిక స్థలంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ద్వారా అర్హులకు భవన నిర్మాణాలపై ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఏర్పాటు చేసినట్లు న్యాక్ ట్రైనింగ్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్ల లోపు వారికి మేషన్/బిల్డింగ్ వర్క్‌లో 15, మార్బుల్ అండ్ గ్రానైట్ టైల్ ఫ్లోరింగ్‌లో 15, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో 15 రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజనం, యూనిఫాం, సేఫ్టీ హెల్మెట్, స్టేషనరీ ఉచితంగా ఇవ్వడంతోపాటు స్టైఫండ్ కింద రూ.4500 ఇస్తామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు లేబర్‌కార్డు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్సు ప్రతులు, బ్యాంకు ఖాతా నంబర్, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రెడ్డిపాలెం రైతు వేదిక ట్రైనింగ్ సెంటర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు. సెంటర్ ఇన్‌చార్జ్‌గా డి.ప్రసాద్‌ను నియమించినట్లు ఏడీ తెలిపారు.

హెల్త్ మేళాలు నిర్వహించాలి



గీసుకొండ : జిల్లాలోని పల్లె దవాఖానల్లో ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్‌నర్సులు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని, హెల్త్ మేళాలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో పల్లె దవాఖానల సేవలపై సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 60 ఏళ్ల వయస్సు పైబడి వారికి ఆరోగ్య రక్షణకు కృషి చేయాలన్నారు. అసంక్రమిత వ్యాధులతో బాధపడే వారికి ఇంటి వద్ద చూసుకునే వారు లేకపోతే వారికి ఆరోగ్యకార్యకర్తలు, ఆశ కార్యకర్తలు అండగా ఉండాలన్నారు. ఈ–సంజీవని కార్యక్రమం ద్వారా ప్రతి రోజు కనీసం 15 మందికి టెలి మెడిసిన్ ద్వారా సేవలు అందించాలన్నారు. ప్రోగ్రాం అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు, భరత్‌కుమార్, దిలీప్, పల్లె దవాఖానల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామపంచాయతీగా తెట్టెకుంటతండా

- మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన తండావాసులు



మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న తెట్టెకుంటతండావాసులు

రాయపర్తి: మండలంలోని తిర్మలాయపల్లికి అనుబంధమైన తెట్టెకుంటతండా గ్రామ పంచాయతీగా ఏర్పడింది. దీంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. తండావాసుల విజ్ఞప్తి మేరకు విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తీసుకెళ్లారు. దీంతో సీఎం వెంటనే స్పందించి తెట్టెకుండతండాను గ్రామపంచాయతీగా ప్రకటించినట్లు మంత్రి తెలిపారు. కాగా, తొర్రూరు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, సర్పంచ్ గజవెల్లి అనంత, ముద్రబోయిన వెంకన్న, గ్రామ అధ్యక్షుడు దోకుడు దేవేందర్, వళపాక కుమారస్వామి, మైబురెడ్డి, తండావాసులు పాల్గొన్నారు.

మైలారం రామాలయానికి రూ.15 లక్షలు ..
మైలారం గ్రామ రామాలయం చుట్టూ ప్రహరీ, రేకులషెడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలను మంత్రి ఎర్రబెల్లి మంజూరు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, సర్పంచ్ లేతాకుల సుమతి, గబ్బెట బాబు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, లేతాకుల మాధవరెడ్డి, సంధి వంశీధర్‌రెడ్డి, మండల కోఆప్షన్ అశ్రఫ్‌పాషా ఉన్నారు.

సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి

- కలెక్టర్ ప్రావీణ్య



కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : సర్దార్ సర్వాయి పాపన్నను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పాపన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి ఆమె మాట్లాడారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపూర్‌లో జన్మించిన పాపన్న గెరిల్లా సైన్యాన్ని తయారు చేసి దేశ రక్షణకు పాటుపడ్డారని తెలిపారు. కులవృత్తులను ప్రోత్సహించే వారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స, డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు, డీఎస్‌డీఓ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంటలకు సేంద్రియ ఎరువులు వాడాలి
పర్వతగిరి : ప్రజ్వల్ ఫార్మర్స్ సొసైటీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మారి సంస్థ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రజల్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ హనుమకొండ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేల పునరుత్పత్తి వ్యవసాయ, ఆగ్రో ఫారెస్ట్ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో కొందరు ప్రజ్వల్ సొసైటీ మాదిరిగా రైతులకు తోడ్పాటును అందిస్తామని అనుమతి కోసం దరఖాస్తు చేసుకుని ముందుకు రాలేకపోయారన్నారు. రైతులు భూమిని కాపాడితే.. భూమి మనలను కాపాడుతుందని అన్నారు. సేంద్రియ ఎరువు, సూక్ష్మజీవులు నింపిన ఎరువు భూమికి అన్ని పోషకాలు అందిస్తూ పంటకు బలాన్ని చేకూరుస్తుందన్నారు. రైతులు సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపాలని కోరారు. అనంతరం రూర్బన్ ప్రాజెక్టులో భాగంగా మండల కేంద్రంలో చేపట్టిన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి, డీఆర్‌డీఓ సంపత్‌రావు, అగ్రికల్చర్ డైరెక్టర్ వంశీకృష్ణ, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్, ఏఓ ప్రశాత్‌కుమార్, ఆర్‌ఐ భారతి, ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



వెంకటాపూర్‌లో పంట నష్టపరిహారం చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య

సంగెం : బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. వెంకటాపూర్ గ్రామంలో అకాల వర్షాలకు దెబ్బతిని పంటలు నష్టపోయిన 142 మంది రైతులకు రూ 14.37 లక్షల విలువైన చెక్కులను కలెక్టర్ పి.ప్రావీణ్యతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భగా గ్రామంలో రూ.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, మహిళా భవనం, గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుండా పంట నష్టపరిహారం అందజేసిన ఘనత సీఎం కేసీఆర్‌ దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌కు తప్ప ఏ ఇతర పార్టీలకు ప్రజలు తమ మద్దతునివ్వరన్నారు. మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయరంగాల్లో ఎదిగేలా సీఎం కేసీఆర్ అవకాశాలు కల్పించారని తెలిపారు. కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కులవృత్తుల వారిని ఆదుకుని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ కళావతి, జడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ పూజారి ఉమాదేవి, ఎంపీటీసీ ప్రచూర్ణ, జేడీఏ ఉషాదయాళ్, ఏడీఏ సురేష్, ఏఓ యాకయ్య, పీఆర్ డీఈ జ్ఞానేశ్వర్, ఏఈ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను పూర్తిచేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

కరీమాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా సత్వరమే పూర్తిచేయాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం ఆసరా పింఛన్లు, తెలంగాణకు హరితహారం, గృహలక్ష్మి, ఇంటి పట్టాల పంపిణీ, జీఓ 59, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, బీసీ, మైనారిటీలకు లక్ష ఆర్థిక సాయం, గొర్రెల పంపిణీ, దళితబంధు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఈనెల 26న జిల్లాలో 3 లక్షల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజీ వాకడే, డీఆర్‌డీఓ సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి పలు సూచనలు చేశారు. పనులు పెండింగ్ లేకుండా చూడాలని ఆమె ఆదేశించారు.

పట్టాలిచ్చి మళ్లీ పంపకాలు ఏమిటి?

- జేసీబీని అడ్డుకున్న లబ్ధిదారులు



పనులు అడ్డుకుంటున్న లబ్ధిదారులు

వర్ధన్నపేట : పేదలకు పట్టాలిచ్చిన భూమికే తిరిగి పట్టాలిస్తామని, పాతవారిని కాదని కొత్తవారికి ఎలా ఇస్తారని లబ్ధిదారులు ప్రశ్నించారు. భూమిని చదును చేస్తున్న జేసీబీని శుక్రవారం అడ్డుకుని ఆందోళనకు దిగిన సంఘటన దమ్మన్నపేటలో చోటుచేసుకుంది. లబ్ధిదారుల కథనం ప్రకారం.. దమ్మన్నపేట గ్రామంలో 2006లో కాంగ్రెస్ ప్రభుత్వం 6 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 185 మంది పేదలకు పట్టాలు అందజేసింది. అప్పుడు తెలంగాణ ఉద్యమం తీవ్రం కావడంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయలేదు. దీంతో ఆ భూమిని సర్పంచ్ ఆధ్వర్యంలో చదును చేస్తుండగా పట్టాదారులు అడ్డుకున్నారు. మళ్లీ కొత్తగా ఇందులోకి ఎలా అడుగు పెడుతున్నారని లబ్ధిదారులు నిలదీశారు. గతంలో పంపిణీ చేసిన పట్టాలు చెల్లవని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి పంపిణీ చేస్తామని చెప్పడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పట్టాలిచ్చిన వారికి పంపిణీ చేసి, మిగిలిన భూమిని అర్హులకు అందజేయాలని, అవసరమైతే గ్రామసభ ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని తహసీల్దార్ విజయ్‌సాగర్ దృష్టికి తీసుకెళ్లడంతో తాత్కాలికంగా పనులు నిలిపి వేయాలని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎవరు ఆ భూమిలోకి వెళ్లరాదని ఆదేశించడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

‘ధరణి’ సమస్యల పరిష్కారానికి కృషి

- జిల్లా సివిల్ కోర్టు సీనియర్ జడ్జి ఉపేందర్‌రావు



గంగదేవిపల్లిలో సర్పంచ్, గ్రామస్తులతో మాట్లాడుతున్న జడ్జి ఉపేందర్‌రావు

గీసుకొండ : ధరణి పోర్టల్‌తో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులతో సమీక్షించి పరిష్కారమయ్యేలా చూస్తామని జిల్లా సివిల్ కోర్టు సీనియర్ జడ్జి జె.ఉపేందర్‌రావు అన్నారు. గంగదేవిపల్లిలో ధరణి సమస్యలపై నేతాజీ సర్వీస్ టీం, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సహాయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణిలో ఉన్న సమస్యలను రైతుల ద్వారా సేకరించి కలెక్టర్ దృష్టికి తెస్తామని, అక్కడ పరిష్కారం కాకుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, హైకోర్టులో లీగల్ సెల్ ద్వారా న్యాయవాదిని ఏర్పాటు చేసి రైతుల భూ సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. నేతాజీ సర్వీస్ టీం అధ్యక్షుడు మొగసాని శంకర్, సర్పంచ్ గోనె మల్లారెడ్డి, రైతులు జనార్దన్, రాజు, చెల్పూరి హరీష్, పరికి వెంకటేశ్, విజయ్, కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఐటీఐలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ ఐటీఐలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వంగాల మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రెండు విడతల్లో ప్రవేశాలు భర్తీ చేశామని, మిగిలిన సీట్లకు మూడో విడత ప్రక్రియ మొదలు పెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం ములుగు రోడ్డులోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలోని ఆర్టీసీ ఐటీఐలో సంప్రదించాలని కోరారు. డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, పెయింటర్, వెల్డర్ ట్రేడ్‌లలో ఖాళీలున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు 98494 25319, 80081 36611 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ముందుండాలి

- ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్



సంగెం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న డీసీపీ రవీందర్

సంగెం: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ముందుండాలని ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ సూచించారు. సంగెం పోలీస్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలు, వ్యక్తులను గుర్తించాలని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చేవారికి తగిన న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, పర్వతగిరి సీఐ శ్రీనివాస్, ఎస్సై భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్సీ ఏర్పాటు చేయాలి : డీటీఎఫ్



మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుల గోవిందరావు

రాయపర్తి : రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగులకు రెండో వేతన సవరణ కమిషన్ (పీఆర్‌సీ)ను ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుల గోవిందరావు డిమాండ్ చేశారు. మండలంలోని కొండూరు, తిర్మలాయపల్లి, పెర్కవేడు, కొత్తూరు ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి వేతన సవరణ కమిషన్ సిఫార్సుల అమలులో జాప్యం కారణంగా ఉపాధ్యాయ, ఉద్యోగులు లక్షలాది రూపాయలు నష్టపోయారని గుర్తు చేశారు. అలాంటిది పునరావృతం కాకుండా రెండో వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేసి, మధ్యంతర భృతి(ఐఆర్) విడుదల చేయాలని కోరారు. విద్యారంగంలో ఖాళీగా ఉన్న అనేక పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయకపోడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.రామిరెడ్డి, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు గారె కృష్ణమూర్తి, రమేష్, అనురాధ పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయ ఈఓకు పదోన్నతి



శేషుభారతిని సత్కరిస్తున్న సిబ్బంది, అర్చకులు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయ కార్యనిర్వహణాధికారి కె.శేషుభారతి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఈసందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ అభినందనలు తెలిపారు. అనంతరం దేవాలయ కార్యాలయంలో అర్చకులు, సిబ్బంది శేషుభారతి దంపతులను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, అర్చకులు భద్రకాళి శేషు, చెప్పెల నాగరాజుశర్మ, సిబ్బంది కూచన హరినాథ్, చింత శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

ఘరానా చీటింగ్

- రూ.2 కోట్లతో ఉడాయించిన చీటీ వ్యాపారి
- లబోదిబోమంటున్న బాధితులు

నల్లబెల్లి: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో ఓ వ్యక్తి అనధికారికంగా చీటి దందా నిర్వహించాడు. పదేళ్లుగా చిట్టీల నిర్వహిస్తుండడంతో నమ్మకంతో మండలంలోని పలువురు సభ్యులుగా చేరారు. వారి నుంచి డబ్బులు వసూలు చేసి రూ.5లక్షలు, రూ.2లక్షలు, రూ.1లక్ష, రూ.50వేల చీటీలు నిర్వహించాడు. ఒక్కొరి దగ్గర రూ.2 వేల నుంచి రూ.12,500 వరకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వసూలు చేశాడు. కొన్నాళ్లు నమ్మకంగా చెల్లిస్తూ వచ్చాడు. చీటి తీసుకున్న వారి నుంచి కూడా డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీసుకున్నవారికి వడ్డీ చెల్లిస్తామని నమ్మించాడు. గత ఐదారు నెలలుగా వసూలు చేసిన చీటి డబ్బులు గడువు తీరిన వారికి చెల్లించకుండా జాప్యం చేశాడు. ఇలా సుమారు రూ.2కోట్ల వరకు డబ్బులు జమ చేశాడు. సభ్యుల నుంచి డబ్బులు చెల్లించాలని ఒత్తిళ్లు వచ్చే అవకాశం ఉందని భావించి, ముందస్తు ప్రణాళికతో తన ఇంటిపై రూ.14 లక్షల బ్యాంకు రుణం తీసుకున్నారు. 25 తులాల బంగారు ఆభరణాలపై బ్యాంకులో తీసుకున్న రుణాన్ని చెల్లించి బంగారం విడిపించుకున్నాడు. మరో 10 తులాల బంగారు ఆభరణాలను కొనుగోలు చేశాడు. 10 గుంటల భూమిని విక్రయించి సొమ్ముచేసుకున్నాడు. బాధితులు తనకున్న కొద్దిపాటి ఆస్తిని సైతం జప్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వకుండా పక్కా ప్రణాళికతో ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి రాత్రికి రాత్రే ఉడాయించాడు. విషయం తెలుసుకున్న బాధితులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది నగదు రూపంలో ఇవ్వగా, మరికొంతమంది ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరిపినట్లు చెబుతున్నారు. తనను ఇబ్బందులకు గురిచేస్తే కోర్టు నుంచి ఐపీ తెచ్చుకుంటానని సదరు నిర్వాహకుడు చెబుతున్నాడని కొంతమంది బాధితులు పేర్కొంటున్నారు. అయితే ఈ విషయంలో బాధితులు ఎవ్వరు ముందుకు రాకపోవడం విడ్డూరం.

అనుమతి లేకుంటే చర్యలు

గ్రామాల్లో అనుమతి లేకుండా చీటీలు నిర్వహించొద్దు. అనుమలు లేనివావద్ద ప్రజలు చీటీలు వేయకూడదు. ఇప్పటి వరకు బాధితులు ఎవరు ఫిర్యాదు చేయలేదు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

- నైనాల నగేష్, ఎస్సై, నల్లబెల్లి

48వ వసంతంలోకి..

- అర్ధశతాబ్దానికి చేరువలో కాకతీయ యూనివర్సిటీ
- న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్‌తో జోష్
- వేధిస్తున్న అధ్యాపకుల కొరత
- నేడు కేయూ ఆవిర్భావ దినోత్సవం


తాటికొండ రమేష్, వీసీ


కేయూ పరిపాలనభవనం

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఉస్మానియా విశ్వ విద్యాలయం తర్వాత అంతటి ప్రతిష్ట కలిగినది కాకతీయ యూనివర్సిటీ.. ఉస్మానియా యూనివర్సిటీ పీజీ సెంటర్‌గా ప్రారంభమై 1976 ఆగస్టు 19న కాకతీయ యూనివర్సిటీగా ఆవిర్భవించిన కేయూ.. నేటితో 48వ వసంతంలోకి అడుగిడుతోన్న సందర్భంగా ప్రత్యేక కథనం.

- నాలుగు విభాగాల పీజీ కోర్సులతో ప్రారంభమైన కేయూ ప్రస్తుతం 28 విభాగాలతో కొనసాగుతుంది. కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాలు ఉండగా శాతవాహన యూనివర్సిటీ ఏర్పాటు తర్వాత మూడు ఉమ్మడి జిల్లాలతో కొనసాగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్, అటానమస్ డిగ్రీ కళాశాలలు 287వరకు ఉండగా పీజీ కళాశాలలు 74, ఇంజనీరింగ్ 6, ఫార్మసీ 25, ఎడ్యుకేషన్ 41, ఫిజికల్ ఎడ్యూకేషన్ 3, లా కళాశాలు 3, ఎంబీఏ 24, ఎంసీఏ 7, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలు 3 ఉన్నాయి.
- యూనివర్సిటీలో అన్ని విభాగాలు కలిపి 409 అధ్యాపకుల (అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ల) పోస్టుల మంజూరు ఉండగా ప్రస్తుతం 86 మంది అధ్యాపకులే ఉన్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీకి 136 పోస్టులు మంజూరు చేసినా ఇప్పటివరకు నియమించ లేదు.
- యూనివర్సిటీలో సుమారు 180వరకు కాంట్రాక్టు లెక్చరర్లు, 200లకుపైగా పార్ట్‌టైం లెక్చరర్లు పనిచేస్తున్నారు.
- యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేశారు.
- వీసీ రమేష్ తన ఇష్టారాజ్యంగా పాలన కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- కేయూలో రెండు మూడు పరిపాలనా పదవులను ఒకరే నిర్వర్తిస్తున్నారు.
- ఉద్యోగుల సమస్యలపై ఆందోళనలు చేస్తే షోకాజ్ నోటీసులు, బదిలీలు చేస్తుండడం వివాదాలకు తావిస్తుంది.
- యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో భారీగా ఫీజుల పెంపుపై విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేడు న్యాక్ సక్సెస్ మీట్

నేడు యూనివర్సిటీ 48 ఆవిర్భావ దినోత్సవ వేడుకలతోపాటు, న్యాక్ ఏ ప్లస్ సాధించిన నేపథ్యంలో సక్సెస్ సెలబ్రేషన్స్‌ను నిర్వహించనున్నారు. తెలిసింది. ఉదయం 11 గంటలకు కేయూ సెనెట్‌హాల్‌లో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య తాటికొండ రమేష్, ఉపన్యాసకులుగా న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్ పాల్గొంటారు.

- యూనివర్సిటీ భూమిలోనే ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇళ్లుతోపాటు మరోఇద్దరు ఉద్యోగుల ఇళ్లు కలిసి 13మందివి ఉన్నా.. వారిపై చర్యలు తీసుకోలేకపోతున్నారు.
- న్యాక్ కోసం క్యాంపస్‌లో రూ.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి, మరమ్మతులు, సుందరీకరణ పనులు చేశారు. ఇటీవల కేయూ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించింది.
- యూనివర్సిటీలో కే హబ్, మహిళలకు మరో వసతి గృహం నిర్మాణాలు పూర్తికావచ్చాయి.

పాపన్న స్ఫూర్తితో గీత కార్మికుల అభివృద్ధి

- రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు


వేడుకలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో గీత కార్మికుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గౌడ సంఘాల ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు శుక్రవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనం ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. సామాన్య గీత కార్మిక కుటుంబంలో జన్మించిన సర్వాయి పాపన్న మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించాడని గుర్తు చేశారు. సర్వాయి పాపన్న స్ఫూర్తితో గీత కార్మికుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. మద్యం దుకాణాల టెండర్లలోనూ గీత కార్మికులకు ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించిందని తెలిపారు. చెట్ల పన్ను రద్దు చేసి వారి అభ్యున్నతికి కేసీఆర్ పాటుపడుతున్నారని పేర్కొన్నారు. సుమారు రూ.8 కోట్లతో హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో నీరా కేఫ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరబాబు, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్, నాయకులు శామకూరి ఐలయ్య, రాయిపెల్లి యాకయ్య, తాళ్లపల్లి రమేష్, హేమాద్రి, దూలం శ్రీనివాస్, నాగపురి అశోక్ పాల్గొన్నారు.

ముగిసిన మార్కెట్ సెక్రటరీల టూర్

వరంగల్: కేంద్ర మార్కెటింగ్‌శాఖలోని 130వ బ్యాచ్‌కు చెందిన ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన మార్కెటింగ్ శాఖ అధికారులు, కార్యదర్శులు రెండు రోజుల స్టడీటూర్, శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏనుమాముల మార్కెట్‌లోని మిర్చి, పత్తి, పసుపు–పల్లికాయ, ధాన్యం–అపరాల యార్డుల్లో జరిగిన క్రయ, విక్రయాలను పరిశీలించారు. అనంతరం మన అగ్రిటెక్‌ను చైర్‌పర్సన్ దిడ్డిభాగ్యలక్ష్మితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లోని పాలనా వ్యవహారాలను ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ.రాహుల్ వారికి వివరించారు. కార్యక్రమంలో జేడీఎం మల్లేషం, డీడీఎం అజ్మీరా రాజు, డీఎంఓ ప్రసాద్ రావు, డీఎంఐకి చెందిన సీనియర్ మార్కెటింగ్ ఆఫీసర్ ఫణిరాజశేఖర్, మార్కెటింగ్ అధికారి రాఘవేంద్ర, కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, గ్రేడ్–2 కార్యదర్శులు బియాబాని, రాము, మార్కెట్ అధికారులు రాజ్‌కుమార్, కృష్ణమీనన్, వెంకన్న, మురళి, శివకుమార్, గంగాధర్, రమణ, స్వప్న పాల్గొన్నారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్‌కు అవార్డు


గోవర్దనం వేణుగోపాల్


బహుమతికి ఎంపికైన ఫొటో

ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఈ మేరకు రవీంద్రభారతిలో మూడు విభాగాలుగా నిర్వహించిన పోటీల్లో శుక్రవారం విజేతలను ప్రకటించారు. ఇందులో జనగామ జిల్లా సాక్షి దినపత్రిక ఫొటోగ్రాఫర్ గోవర్దనం వేణుగోపాల్ కేటగిరీ–3లో కన్సోలేషన్ బహుమతికి ఎంపికయ్యారు. కాగా, ఈ నెల 20వ తేదీన ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్ రావు బహుమతి ప్రదానం చేయనున్నారు.

- జనగామ

క్రమశిక్షణతో అత్యుత్తమ ఫలితాలు

- ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి


మాట్లాడుతున్న ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి

హసన్‌పర్తి: క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర పఠనం ద్వారా అత్యుత్యమ ఫలితాలు సాధించవచ్చని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బీ.టెక్‌లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థినులకు శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సమావేశానికి వరదారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధ్యాపకులే కాకుండా తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యనందించడంలో సుమతిరెడ్డి కళాశాల ముందు వరుసలో ఉందన్నారు. విద్యార్థినులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తూ వారిలో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలు వెలికి తీస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాలకు వివిధ కంపెనీలను ఆహ్వానించి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థిని ఉద్యోగం పొందేలా బోధన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుదర్శన్, డాక్టర్ మహేందర్, ఏఓ వేణుగోపాలస్వామి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఎక్కడ..?

- మోరంచపల్లి వరదలో కొట్టుకుపోయిన మహిళ
- నేటికీ లభ్యంకాని ఆచూకీ
- ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు


మహాలక్ష్మి(ఫైల్)


ఇంటి ఎదుట దీనస్థితిలో మహాలక్ష్మి భర్త శ్రీనివాస్

భూపాలపల్లి అర్బన్: జూలై 27వ తేదీన కురిసిన భారీ వర్షాల కారణంగా భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామాన్ని వరద ప్రవాహం ముంచెత్తిన విషయం తెలిసిందే. ఈ వరద ఉధృతిలో గ్రామానికి చెందిన నలుగురు కొట్టుకుపోయారు. వీరిలో ముగ్గురి మృతదేహాలు లభ్యం కాగా.. గడ్డం మహాలక్ష్మి ఆచూకీ నేటికీ లభ్యంకాలేదు. 22 రోజులుగా పోలీసులు సైతం గాలింపు చర్యలు చేపడుతున్నారు. అయితే వరద ప్రవాహంలో కొట్టుకుపోవడంతో ఇప్పటికే మహాలక్ష్మి మృతిచెంది ఉంటుందని కుటుంబ సభ్యులు సైతం భావిస్తున్నారు. కానీ, కనీసం మృతదేహం ఆనవాలైన కపిస్తుందని ఎదురు చూస్తునారు. మహాలక్ష్మి ఇద్దరు కుమార్తెలు తల్లి గల్లంతు నాటినుంచి తండ్రి శ్రీనివాస్‌కు ధైర్యం చెబుతూ తనవద్దనే ఉంటున్నారు. రెండు వారాల క్రితం మొగుళ్లపల్లి మండలంలో చలివాగు పరివాహక ప్రాంతం, మూడు రోజుల క్రితం ఏటూరునాగారం గోదావరి పరివాహక ప్రాంతంలో రెండు మృతదేహాలు కన్పించాయి. అందులో మహాలక్ష్మి ఆనవాళ్లు లేకపోవడతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని ఎక్స్‌గ్రేషియా..

వరదలో కొట్టుపోయి చనిపోయిన పేరుతో ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అయితే మృతదేహాలు దొరికిన వారికి మాత్రమే ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నారు. అయితే మహాలక్ష్మి ఆచూకి ఇంకా లభ్యం కాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు, ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఎక్స్‌గ్రేసియో ఇవ్వాలంటే తప్పనిసరిగా పోస్టుమార్టం రిపోర్టు ఉండాలని అధికారులు చెబుతున్నారు. మహాలక్ష్మి ఇంకా చనిపోయినట్లు నిర్ధారణ కాకపోవడంతో పోస్టుమార్టం రిపోర్ట్ రావడం కష్టం. దీంతో అధికారులు ప్రభుత్వానికి ఎటువంటి నివేదికను పంపించలేదని తెలిసింది.

మిస్సింగ్ కేసు నమోదు చేశాం

మహాలక్ష్మి ఆచూకి కోసం మూడు మండలాల పరిధిలోని వాగులు, చెరువుల వెంట గాలింపు చర్యలు చేపడుతున్నాం. ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేశాం. ఆరు నెలల వరకు వేసి చూసి కేసు కొట్టివేస్తాం. ఎక్కడైనా మృతదేహాలు కనిపిస్తే వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇస్తున్నాం. వారు కుడా పరిశీలిస్తున్నారు.

- రాంనర్సింహారెడ్డి, సీఐ భూపాలపల్లి

నిద్రలోనే గుండెపోటుతో బాలింత మృతి

- ప్రసవించిన 5 రోజులకే ఘటన


సుష్మిత(ఫైల్)

వరంగల్ చౌరస్తా: వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో శుక్రవారం ఉదయం తెల్లవారుజామున గుండెపోటుతో బాలింత మృతి చెందింది. కుటుంబసభ్యులు, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన బుస్స సుష్మిత (25) మొదటి కాన్పు ప్రసూతి వైద్యసేవల కోసం సీకేఎం హాస్పిటల్‌లో ఈనెల 13 చేరింది. ఆదే రోజు సిజేరియస్ ద్వారా మగశిశువుకు జన్మనిచ్చింది. శిశువు అనారోగ్యంగా ఉండడంతో నవజాత శిశువుల వార్డులోని ఇంక్యుబేటర్లో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. తల్లి సుష్మితను ఐసీయూనుంచి 18న ప్రత్యేక వార్డుకు మార్చారు. శుక్రవారం ఉదయం సుమారు 4:30 గంటల సమయంలో సుష్మిత వెళ్లి శిశువుకు పాలు పట్టించి వచ్చి నిద్రపోయింది. తిరిగి రెండు గంటల అనంతరం బాబుకు పాలుపట్టాలని తల్లి నిద్రలేపే ప్రయత్నం చేయగా కదలకపోవడంతో వైద్యులను సంప్రదించారు. డ్యూటీ వైద్యులు వెంటనే పరీక్షించి సీపీఆర్ నిర్వహించినప్పటికీ ఫలితం లేకపోయింది. నిద్రలో కార్డియాక్ అరెస్ట్ కావడంతో సుష్మిత మృతి చెందినట్లు సీకేఎం సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మలకుమారి తెలిపారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి ..


పరమేశ్వరచారి (ఫైల్)

వర్ధన్నపేట: ప్రమాదవశాత్తు హెచ్‌టీ విద్యుత్ లైన్ తీగలు తగిలి షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలో చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన రామగిరి పరమేశ్వరచారి(60) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో తన ఇంటిలో విద్యుత్ మరమ్మతు పనులు చేయడంకోసం పట్టణానికి చెందిన బొంత సుధాకర్‌ను కోరాడు. తాను పట్టణంలోనే మరోచోట చంద్రకళ అనే మహిళ ఇంట్లో పనులు చేస్తున్నట్లు చెప్పాడు. దీంతో పరమేశ్వరచారి అక్కడకు వెళ్లి సుధాకర్‌తో మాట్లాడుతున్న క్రమంలో డాబా పైన ఉన్న హెచ్‌టీ లైన్ పీవీసీ పైపుతో ఉన్న విద్యుత్ తీగలకు తన చేయి తాకింది. దీంతో షాక్‌కు గురైన పరమేశ్వరచారిని కర్రతో కొట్టి సుధాకర్ తీగనుంచి వేరుచేశాడు. అనంతరం పరమేశ్వరచారి కుమారుడు శ్యాంప్రసాద్‌తో కలిసి వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరమేశ్వరచారి మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పరమేశ్వరచారికి భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు శ్యాంప్రసాద్, కుమార్తెలు స్వాతి, సింధు ఉన్నారు. శ్యాంప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

హడక్ లోకోపైలెట్లు రెగ్యులరైజ్

- ఉత్తర్వులు జారీ చేసిన రైల్వే అధికారులు
- 381 మందికి పోస్టింగ్

కాజీపేట రూరల్: రైల్వే రన్నింగ్ స్టాఫ్ డిపార్ట్‌మెంట్‌లో హడక్ గూడ్స్ లోకోపైలెట్లుగా పని చేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేస్తూ సికింద్రాబాద్ రైల్వే అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ రన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్ తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో 2019 నుంచి హడక్‌గా గూడ్స్ లోకోపైలెట్లు పని చేస్తున్నారని తెలిపారు. 2021లో రైల్వే జీఎంతో జరిగిన జీఎం పీఎన్‌ఎం మీటింగ్‌లో రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ జనరల్ సెక్రటరి రాఘవయ్య లోకోపైలెట్లను రెగ్యులరైజ్ చేయాలని ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. దీంతో రైల్వే ఉన్నతాధికారులు పరిశీలించి నాలుగు సంవత్సరాల తర్వాత డివిజన్‌లో 381 మంది గూడ్స్ హడక్ లోకో పైలెట్లను రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. దీంతో కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని సనత్‌నగర్, బెల్లంపల్లి, రామగుండం, డోర్నకల్ జంక్షన్‌లో పని చేస్తున్న ఎక్కడి లోకోపైలెట్లకు అక్కడే పోస్టింగ్‌లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే సంఘ్ జనరల్ సెక్రటరి ఎం.రాఘవయ్య, సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరి డి.భుజంగరావు కృషితోనే హడక్ లోకోపైలెట్ల రెగ్యులరైజేషన్ జరిగిందని, ఇది సంఘ్ విజయంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అరుణాచలానికి బస్సు సౌకర్యం

హన్మకొండ: తమిళనాడులోని అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తుందని వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆమె ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 30న పౌర్ణమిని పురస్కరించుకుని సూపర్ లగ్జరీ బస్సును నడపనున్నట్లు తెలిపారు. బస్సు ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ బస్ స్టేషన్‌లో బయలు దేరుతుందని, 30న ఉదయం కాణిపాకం, మధ్యాహ్నం 1 గంటకు వెల్లూరులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం సాయంత్రం 7 గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందని వివరించారు. భక్తులు సర్వీస్ నంబర్ 92222 బస్సును ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. గిరి ప్రదక్షిణ అనంతరం 31న అరుణాచలం నుంచి బయలు దేరి జోగుళాంబ శక్తి పీఠం సన్నిధికి వెళ్తుందని, ఇక్కడ దర్శనానంతరం హనుమకొండకు బయలు దేరుతుందని వివరించారు. చార్జీ ఒక్కరికి రూ.4,500గా నిర్ణయించినట్లు తెలిపారు. టీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో, సమీపంలోని ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలో రిజర్వేషన్ చేసుకోవచ్చని వివరించారు. ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం 99592 26047, 73828 55492 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పంట నష్టంతో రైతు ఆత్మహత్య


చక్రపాణి (ఫైల్)

టేకుమట్ల(రేగొండ): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వేసిన పంట వరదలో కొట్టుకుపోవడంతో మనస్తాపానికి గురైన ఓ రైతు ఆత్మహత్య పాల్పడ్డాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కనిపర్తిలో శుక్రవారం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనిపర్తికి చెందిన శ్రీపతి చక్రపాణి (63) తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో పత్తి పంటను సాగు చేయగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట ధ్వంసమైంది. దీంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చడం అని మనస్తాపానికి గురై ఈ నెల 16న గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు పరకాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ శుక్రవారం చక్రపాణి మృతి చెందాడు. మృతుడి భార్య భద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


నవీన్‌కుమార్(ఫైల్)

డోర్నకల్: మానుకోట జిల్లా డోర్నకల్ మండలంలోని లింబ్యాతండా శివారు లచ్చాతండాకు చెందిన యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డోర్నకల్ సీఐ ఉపేందర్ రావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చాతండాకు చెందిన బాదావత్ కృష్ణ, పద్మ దంపతుల కుమారుడు నవీన్‌కుమార్(24) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న నవీన్‌కుమార్ మూడు రోజుల క్రితం లచ్చాతండాకు వచ్చాడు. గురువారం ఉదయం పురుగుమందు తాగి అపస్మారకస్థితిలో ఉన్న నవీన్‌కుమార్‌ను కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రాత్రి మృతి చెందాడు. ప్రేమ విఫలం కావడంతో నవీన్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని సీఐ తెలిపారు. ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ నవీన్ తల్లిదండ్రులను పరామర్శించారు.

60ఏళ్లు దాటిన రైతులకు పింఛన్ ఇవ్వాలి

వరంగల్: జై జవాన్.. జై కిసాన్ అని నినాదమిచ్చే భారతదేశంలో అమరులైన, రిటైర్డ్ జవాన్ల కుటుంబాలను గౌరవిస్తున్న విధంగానే 60ఏళ్లు దాటిన రైతులందరికీ నెలకు రూ.10వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగమిచ్చి గౌరవించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఏఐకేఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మద్రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో రైతు సదస్సు ముగింపు సమావేశంలో శుక్రవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. రైతులకు పెన్షన్, పంటలకు గిట్టుబాటు ధరలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో రైతులు, సాగుదారులకు ఓటు హక్కు, రైతు కుటుంబాలకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్య, ఉద్యోగ, వైద్య రంగాల్లో రిజర్వేషన్, వ్యవసాయ రంగానికి ఉపాధి పథకం అనుసంధానం, పసుపు పంటకు రూ.15వేలు, మిర్చికి రూ.30వేలు మద్దతు ధరలు, కౌలు, పోడు రైతులను గుర్తించాలని, రైతులకు రుణాలు మాఫీ చేసి వడ్డీలేని రుణాలు అందించాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్, నాయకులు సింగతి సాంబయ్య, మోర్తాల చందర్‌రావు, నర్సయ్య, శంకర్‌రావు, ఆనందరావు, గోపాల్, కుమారస్వామి, తిరుపతి పాల్గొన్నారు.